15 నుంచి ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఏప్రిల్ 15 నుంచి మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత సీజన్‌లో మండల పరిధిలోని 15 రైతు సేవా కేంద్రాల ద్వారా 7 వేల టన్నులు ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. దాళ్వా సీజన్‌లో 8.5 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ రైతు నమోదు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుందన్నారు. మండల పరిధిలో 10 వేల మంది రైతులను గుర్తించగా ఇప్పటివరకు 8200 మంది రైతుల నమోదు పూర్తయిందని ఆయన వెల్లడించారు.

'104' వైద్య సేవలపై నిర్లక్ష్యం

- వైద్య మందించడంలో డాక్టర్ల అలసత్వం
- పూర్తి సమయం కేటాయించని వైనం
- అందుబాటులో అరకొర మందులే

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

104 సేవలు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అరకొరగానే అందుతున్నాయి. ప్రధానంగా వైద్యులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 62 వాహనాల ద్వారా సిబ్బంది సేవలు అందిస్తున్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం వైద్య సిబ్బంది 104 వాహనంలో సంచరిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో ఉండి సేవలు అందిస్తారు. ఈ వాహనాల్లో 30 రకాల వైద్య ఆరోగ్య పరీక్షల కోసం పరికరాలు ఉంటాయి. గ్రామీణ ఆరోగ్యానికి ఈ వాహన సేవలు కీలకం. ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో ఈ వాహనాలు సేవలందిస్తాయి. వాహనాల ద్వారా వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తారు. స్థానిక పిహెచ్‌సి వైద్యులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌సి, ఆశ వర్కరు, నర్సు సేవలందిస్తారు.

వైద్యుల నిర్లక్ష్యం

దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసం అప్పటి ప్రభుత్వం 2008 నవంబరులో 104 సేవల్ని తీసుకొచ్చింది. జిల్లాలో 104 వాహనాలు మండలానికి ఒక్కటి చొప్పున అందుబాటులో ఉన్నాయి. ఇవి ఆయా క్లస్టర్ల పరిధిలో రోజుకి ఒక గ్రామాన్ని కవర్ చేస్తుంది. వీటిలో ఒక వైద్యుడు, ఒక డ్రైవర్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ (డిఇఒ) ఇలా సరిపడా సిబ్బంది విధులను నిర్వర్తిస్తున్నారు. 10 శాతం అదనపు సిబ్బంది కూడా ఉంటారు. వాస్తవానికి ప్రతి వాహనంలో వైద్యుడు సిబ్బందితో కలిసి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒపి సేవలు ఇవ్వాలి. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత వైద్యాధికారి తన సిబ్బందితో కలిసి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. కానీ చాలా వాహనాలలో డాక్టర్లు సమయపాలన పాటించడం లేదని రోగులు అంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఉదయం ఒకసారి వచ్చి కొంతసేపు మాత్రమే ఒపి చూసి వెనుతిరుగుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై కొన్ని ప్రాంతాల్లో పరిశీలన చేయగా వైద్యులు కనిపించలేదు. తొలుత వచ్చి వెళ్లిపోయినట్లు స్థానిక రోగులు తెలిపారు. గొల్లప్రోలు మండలం చినజగ్గంపేట, కోటనందూరు మండలం అల్లిపూడి, జగ్గంపేట మండలం కాట్రావులపల్లి, పెదపూడి మండలం రామేశ్వరం, యు.కొత్తపల్లి మండలం మూలపేట, రౌతులపూడి మండలం ఎ.మల్లవరంలలో మంగళవారం వైద్యులు ఉదయం వచ్చి వెళ్లిపోయినట్లు రోగులు తెలిపారు. ఆ తర్వాత డిఇఒ, స్థానిక ఎఎన్ఎంలు రోగులకు మందులు పంపిణీ చేయాల్సి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకూ మాత్రమే ఒపి చూసి ఆ తర్వాత ఇంటి ముఖం పడుతున్నారని వైద్యులపై ఆరోపణలు ఉన్నాయి. వాళ్లకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో బయోమెట్రిక్ వేసి కొంతమంది సేవలకు డుమ్మా కొడుతున్నారని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఆయా సచివాలయాల పరిధిలో లేవలేని రోగులు, వృద్ధులు, టిబి రోగులు, కుష్టు వ్యాధిగ్రస్తులు, బాలింతలు తదితర వారి కోసం డాక్టర్లు ఇళ్లకు రావడం లేదని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య అవగాహన శిబిరాలు, డ్రైడే కి సంబంధించి ప్రజకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాల్సి ఉన్నా వైద్యులు చాలా ప్రాంతాల్లో కనిపించడం లేదు.

యు.కొత్తపల్లి మండలం మూలపేటలో వైద్యుడు లేకుండా ఎఎన్ఎం, ఇతర సిబ్బంది సేవలు

జర్నలిస్ట్ ఫోటో తీసిన తరవాత సిబ్బంది సమాచారంతో గంట అనంతరం సేవల్లో పాల్గొన్న వైద్యురాలు

అరకొర మందులే దిక్కు

జ్వరం, దగ్గు, జలుబు, విరేచనాలు, గాయాలు మానడానికి తదితర మందులతో సహా బిపి, సుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలకు 108 రకాల మందులను ప్రభుత్వం అందించాల్సి ఉన్నా 50 నుంచి 60 రకాలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయని రోగులు చెబుతున్నారు. ఆయా మండలాల పరిధిలో నెలకు సరిపడా మందులు వాహనాలకు చేరాల్సి ఉన్నా అరకొర మందులు మాత్రమే సరఫరా అవుతున్నాయి. పారాసిటమాల్, నొప్పులు, బిపి, వాంతుల మాత్రలు ప్రస్తుతం అందుబాటులో ఉండడం లేదు. జ్వరం వస్తే సంబంధిత మందులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రోగులు అంటున్నారు.

చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు

చాలీచాలని వేతనాలతో విధుల్లో పాల్గొంటున్న పలువురు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న యాజమాన్యం వైఖరితో పని ఒత్తిడి ఎక్కువగా ఉంటోందని వారు వాపోతున్నారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ఖర్చుల నేపథ్యంలో వేతనాలు సరిపోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించడం లేదని, ప్రభుత్వం స్పందించి తమకు ఈ సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. ఈ సమస్యలపై 104 జిల్లా మేనేజ్మెంట్‌ను సంప్రదించగా స్పందించడానికి సిద్ధ పడలేదు.

నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

నగరంలో సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం ధర్నాలో నేతల డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం నగర పాలక సంస్థ కమిషనర్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అనంతరం అదనపు కమిషనర్ సుధాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలో భాగంగా నగరంలో మార్చి 11 నుంచి 20 వరకు వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలుసుకోవడం జరిగిందన్నారు. సిపిఎం దృష్టికి పలు సమస్యలను ప్రజలు తీసుకొచ్చారని తెలిపారు. పెన్షనర్స్ ప్యారడైజ్‌గా పేరుగాంచిన కాకినాడ నగరం దోమలకు నిలయంగా మారిపోతుం దన్నారు. చెత్త సేకరణకు ఇచ్చిన ప్రాధాన్యత డ్రెయిన్లలో పూడికను తొలగించడంలో కన్పించడం లేదన్నారు. ఫలితంగా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. నగరంలో సామాన్యుల సొంతింటి కల నెరవేర్చాలని, టిడ్కో గృహాలు నిర్మాణం పూర్తి చేయాలని, స్థలం ఉన్నవారికి హౌసింగ్ లోన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వేసవిలో తాగునీటి కొరత లేకుండా చూడాలని, శివారు ప్రాంతాల్లో పరిశుభ్రమైన నీరు అందించాలని కోరారు. నగరంలో అవసరమైనచోట మున్సిపల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, జిజిహెచ్ పడకల స్థాయిని పెంచాలన్నారు. జగన్నాథపురం ఉప్పుటేరు పై 3వ వంతెన నిర్మించాలని, నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలన్నారు. నగర పాలక సంస్థ అధికారులు సాయంత్రం వేళల్లో పేటల్లో పర్యటించాలని కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు కాకినాడ నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించి ప్రజా పాలన కొనసాగించాలన్నారు. సిపిఎం దృష్టికి వచ్చిన వివిధ ప్రాంతాల సమస్యలను రాతపూర్వకంగా అదనపు కమిషనర్‌కు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మలక వెంకట, నాగాబత్తుల సూర్య నారాయణ, నాయకులు ప్రసాద్, మేడిశెట్టి వెంకట రమణ, చంద్రమళ్ళ పద్మ, వెంకట్రావు, కె.సత్తిబాబు, భూలక్ష్మి, భారతి, సత్యానందం, సుధాకర్, సత్యన్నారాయణ, సురేష్, విజయ్, వసంత్ పాల్గొన్నారు.

పిఠాపురంలో ఆర్ఒబి నిర్మాణానికి అనుమతి

ప్రజాశక్తి - కాకినాడ

పిఠాపురంలో రూ.59.70 కోట్లతో ఆర్ఒబి నిర్మించేందుకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని సామర్లకోట-ఉప్పాడ రోడ్డులో రైల్వే క్రాసింగ్ వద్ద ఆర్ఒబి నిర్మాణానికి రూ.59.70 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఆర్ఒబిని నిర్మిస్తామని పిఠాపురం నియోజకవర్గ జనసేన అభ్యర్థి, నేటి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. తొలుత ఆర్ఒబి నిర్మాణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, అనంతరం దాన్ని కేంద్ర రహదారి మౌలికవసతుల నిధి (సిఆర్ఎఫ్) కింద కేంద్ర ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేస్తుందని ఆయన తెలిపారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - గొల్లప్రోలు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కుంచే చిన్న, మండల అధ్యక్షులు ఓరుగంటి నందీశ్వరుడు, సిఐటియు నాయకులు కరణం విశ్వనాథం మాట్లాడారు. శానిటేషన్ వర్కర్లు పనిచేయడానికి కావలసిన పనిముట్లు, వాహనాల మెటీరియల్స్ అందించడం లేదన్నారు. సబ్బులు, బ్లౌజులు, నూనె, యూనిఫాం ఇవ్వాలని, ఇనుప చక్రాల బళ్ళకు మరమ్మతులు చేపట్టాలని, చీపుర్లు అందజేయాలని కోరారు. నగర పంచాయతీ పరిధిలో శానిటేషన్ వర్కర్ల సంఖ్యను పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్ల క్రితం మృతి చెందిన కార్మికుడు బంగారు రాముకు నష్ట పరిహారం రూ.2 లక్షలు వచ్చాయని అధికారులు వెల్లడించారని, అయితే ఆ పరిహారాన్ని నేటికీ ఇవ్వలేదన్నారు. కోవిడ్ కాలంలో పనిచేసిన 8 మందికి ఇప్పటికీ జీతాలు చెల్లించలేదని ఆరోపించారు. అనంతరం నగర పంచాయతీ మేనేజర్ నవీన్ చంద్రకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ అధ్యక్షులు ఎన్.ఏసమ్మ, సిహెచ్.రమణ, రామారావు, రాజు, రాజమోహన్, లోవరాజు, సత్యవతి, దివ్యవాణి, సింహాచలం, పైడిరాజు, చిన్ని, లోవకుమారి, వెంకటేశ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మామిడి తోటల సస్య రక్షణపై సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చినబ్రహ్మదేవంలో బుధవారం ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఎన్ మల్లికార్జునరావు అధ్యక్షతన మామిడి రైతులకు సస్య రక్షణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. తొలుత ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలు, అధికారులు మామిడి తోటలను పరిశీలించారు. అనంతరం జరిగిన సదస్సులో ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఎన్ మల్లికార్జునరావు, కీటక విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.చిన్నబ్బాయి మామిడి సస్య రక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. జిగురు పూసిన నీలిరంగు అట్టలను అమర్చుకోవటం, పిప్రోసిల్, సైయాన్ టినిపోల్, స్పైనో సాడ్, దయోమిదాక్షాం పురుగు మందుల వినియోగంపై వివరించారు. 15 నుంచి 20 రోజుల వ్యవధిలో పురుగు మందులను మార్చి పిచికారి చేయాలన్నారు. మామిడి తోటలు పూత, పిందే దశలో ఉన్నప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలను పాటిస్తూ సస్య రక్షణ చేపట్టటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ సదస్సులో ఉద్యాన శాఖ సిబ్బంది, అధిక సంఖ్యలో మామిడి రైతులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు పిఠాపురం నియోజవర్గం జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, గోదావరి డెల్టా ఛైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ అన్నారు. బుధవారం ఒఎన్‌జిసి ఆర్థిక సాయంతో ఎండపల్లి, కుతుకుడుమిల్లి, కొమరగిరి పాఠశాలల్లో రూ.12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్స్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒఎన్‌జిసి ఇచ్చిన సాయంతో ఆర్ఒ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఆర్ఒ ప్లాంట్స్ దోహదం చేస్తాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు ఈ కార్యక్రమంలో ఒఎన్‌జిసి చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్ఎస్.రామారావు, సురక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, గుండ్ర జగ్గారావు, మత్స అప్పాజీ, గుండ్ర కిషోర్, సూర్యా నిఖిల్ పాల్గొన్నారు.

ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాస్

నమ్మించి మోసం చేశాడని మహిళ ఆవేదన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

నమ్మించి మోసం చేశాడంటూ ఏలేశ్వరంకు చెందిన ఒక మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని ఆమె సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీని ఆశ్రయించారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మండలంలోని యర్రవరం గ్రామానికి చెందిన గురిమెరికల వీర వెంకటలక్ష్మి మాట్లాడారు. ఏలేశ్వరం పట్టణానికి చెందిన కోన శ్రీనివాస్‌తో గత కొన్ని సంవత్సరాలుగా సహజీవనం సాగిస్తున్నానని తెలిపారు. తనను వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకుని, అతని కుటుంబ శుభకార్యాలకు సుమారు రూ.8 లక్షల వరకూ వాడుకున్నాడని తెలిపారు. కొన్ని బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను సైతం వినియోగించుకున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం వివాహం చేసుకోమంటే వెనకడుగు వేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొసిరెడ్డి గణేష్, మహిళా సంఘం నాయకురాలు గండేటి నాగమణి మాట్లాడుతూ బాధితురాలికి అండగా ఉంటామన్నారు.

ఘర్షణకు దిగిన టిడిపి, జనసేన కార్యకర్తలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామంలో టిడిపి, జనసేన కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. బుధవారం చెందుర్తిలోని ఆర్ఒ ప్లాంట్ ప్రారంభోత్సవానికి పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంఎల్ఎ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్ఎన్.వర్మను ఆహ్వానించకపోవడంతో టిడిపి కార్యకర్తలు ఆయనను నిలదీశారు. ఈ సందర్భంగా జనసేన, టిడిపి కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకుంది. అరుపులు, కేకల మధ్య ఆర్ఒ ప్లాంట్‌ను మర్రెడ్డి శ్రీనివాస్ ప్రారంభించి కార్యక్రమం ముగియకుండానే మధ్యలోనే వెళ్లిపోయారు. అనంతరం ఇరుపక్షాల నాయకులు కార్యకర్తలను సముదాయించే ప్రయత్నం చేశారు.

ఘర్షణ పడుతున్న టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కాజులూరు

కుట్టు శిక్షణను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జె.రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 28న రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారనితెలిపారు. కాజులూరు మండలంలోని 26 గ్రామాలకు సంబంధించి ఇప్పటివరకు 1183 కుట్టు శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 120 మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, అయితే దరఖాస్తులు అధికంగా రావడంతో రాష్ట్ర మంత్రి సుభాష్ దృష్టిలో ఉంచడంతో మరో 120 మందికి కుట్టు శిక్షణ ఇవ్వడానికి అవకాశం లభించిందన్నారు. మొదటి విడతలో కాజులూరు సెంటర్‌కి సంబంధించి కాజులూరు, మంజేరు, శీల, ఒంటితాడి, దుగ్గుదుర్రు, కుయ్యేరు, ఉప్పుమిల్లి, కోలంక, పెదలంక, పల్లిపాలెం, నామవానిపాలెం, తిప్పరాజుపాలెం, అయితపూడి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

వేసవిలో పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని జూన్ నెల వరకు నగరంలోని ప్రధాన కూడళ్లలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ చలివేంద్రాల నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రతి దుకాణదారుడు వారి షాపుల వద్ద తాగునీరు సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. బుధవారం మండలంలోని పాండవులపాలెంకి పలువురు కిర్లంపూడిలో గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు రెల్లిసత్యనారాయణ, కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన ఇరటా లక్ష్మిని తన భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనిపై గిరిబాబు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరటా శివ, అడ్డాల నరసింహమూర్తి, ఒనుగుల సీతయ్య, రేచుకట్ల రాంబాబు, సోమాల శ్రీను, కురిపెల్లి శ్రీను, రెల్లి సోమరాజు పాల్గొన్నారు.

సర్వే పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

అన్ని సర్వేలను వేగవంతం చేయాలని తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి ఆదేశించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విఆర్ఒలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారుల పరిశీలన, ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా ఇల్లు నిర్మించుకున్న వారు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్న వారి వివరాల నమోదు, హౌస్ టాక్స్, వాటర్ టాక్స్‌లు ఈ నెలాఖరులోగా నూరు శాతం వసూలు చేయాలన్నారు. అప్పగించిన పనులన్నీ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు.

కార్టూ'నిజం'



నవోదయకు పలువురి ఎంపిక

ప్రజాశక్తి - యంత్రాంగం

కోటనందూరులో...నవోదయ ప్రవేశ పరీక్షల్లో మండలం నుంచి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక విక్టరీ స్టడీ సర్కిల్‌కు చెందిన 11 మంది ఎంపికయ్యారని స్టడీ సర్కిల్ అధినేత పి.చిన్ని తెలిపారు. తమ సర్కిల్‌కు చెరందిన ఎం.పవన్‌వర్ష, ఎం.అక్షయ్‌కుమార్, వై.మనోహర్, పి.తేజస్వరూప్, ఎ.వర్షిత్, ఎల్.సాయిసన్వీ, కె.జోసెఫ్ కిషోర్, సిహెచ్.ఉదయ్‌కుమార్, బి.చంద్రిక, ఐ.యశ్వంత్ 6వ తరగతికి ఎంపికయ్యారని అన్నారు. ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో తమ విద్యార్థులు ఎంపిక కావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. అలాగే మండలంలోని ఎవిఎం కోచింగ్ సెంటర్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని సంస్థ డైరెక్టర్ అలంగ విష్ణు వంూర్తి తెలిపారు. తమ సెంటర్‌కు చెందిన రావాడ చేతన్, అడిగర్ల వత్సా, గాడి జీత్యశ్రీ, పోల మరశెట్టి సందీప్, లాలం తారీష్, మల్ల మోక్షిత్ ఎంపికయ్యారని ఆన తెలిపారు. తమ సెంటర్లో జాతీయ స్థాయిలో నవోదయ శిక్షణ, సిబిఎస్ సిలబస్‌ను ఆంగ్లమాధ్యమంలో శిక్షణ ఇస్తామన్నారు. **ప్రత్తిపాడులో...** నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ నుంచి 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ ఏడాది నవోదయ పరీక్షలకు ఆక్స్ ఫర్డ్ కోచింగ్ సెంటర్ నుంచి పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో 16 మంది విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందని పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా సీట్లు తమ సంస్థ నుంచి ఎంపికయ్యారని అన్నారు. సీట్లు సాధించిన విద్యార్థులకు ఆయన అభినందించారు. **కాకినాడ రూరల్‌లో...**మండల పరిధిలోని తూరంగి గ్రామానికి చెందిన పుప్పాల ఫణిరిత్విక్ నవోదయకు ఎంపికయ్యాడు. స్థానిక శ్రీ చైతన్య స్కూల్లో 5వ తరగతి చదువుతున్న రిత్విక్ ఇటీవల జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరై అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు నవోదయ విద్యాలయలో సీటు సాధించినట్లు శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ టి.శైలజ తెలిపారు. రిత్విక్‌ను స్కూల్ ప్రైమరీ ఇన్‌ఛార్జ్ కెవిడి. శైలజ, క్లాస్ టీచర్ సంగీత, ఎస్ఆర్‌కె నవోదయ ట్యూషన్ సెంటర్ ప్రతినిధి రామకృష్ణ అభినం దించారు. **కరపలో...**మండలానికి చెందిన నలుగురు విద్యా ర్థులు నవోదయకు ఎంపికయ్యారని ఎంఇఒలు కెబి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. పెద్ద కొత్తూరు పాఠశాలకు చెందిన జల్లి ప్రవీణ్‌సంతోష్ ఎంపిక కావడం పట్ల వారు అభినందనలు తెలిపారు. అలాగే వేళంగి భాను ప్రకాష్ ఇంగ్లీ ష్ మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థులు గుత్తుల ప్రజ్ఞ, బచ్చుల విక్టర్ జీవన్ ఎంపికయ్యారు. వీరిని కరస్పాండెంట్ కెకె.సత్యనారాయణ అభినందించారు. వేళంగి లోని ఎయిమ్ కిడ్జ్ స్కూల్లో విద్యార్థి వాసంశెట్టి అక్షయ సత్యఈశ్వరిదేవి ఎంపిక కావడం పట్ల కరస్పాండెంట్ డాక్టర్ గాడ్విన్ అభినందనలు తెలిపారు.

విక్టరీ స్టడీ సర్కిల్ విద్యార్థులు

ఎంపికైన ఎవిఎం కోచింగ్ విద్యార్థులు

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం



ఫణిరిత్విక్

నేరాలు ఘోరాలు

గర్భిణి ఆత్మహత్య

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని జి.వేమవరం గ్రామానికి చెందిన గర్భిణి మహిళ గండి ప్రవల్లిక (21) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యేడాది క్రితం డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం గుత్తినదీవి వేమవరానికి చెందిన ప్రవల్లికకు తాళ్లరేవు మండలం జి.వేమవరానికి చెందిన గండి రాంబాబుతో వివాహం అయ్యింది. ఇటీవల ఆమె గర్భం దాల్చింది. అయితే బుధవారం భర్త ఇంటి వద్దే బాత్ రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. ఆమెను కాకినాడ ప్రయివేట్ హాస్పటల్‌కి తరలించగా అప్పటికే మతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఆయన వివరించారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సివుంది. ఘటనాస్థలికి ఎస్ఐ. సత్యనారాయణ చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలు తండ్రి సలాది సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు చోరీ కేసుల్లో నిందుతుడిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి శ్రీహరిరాజు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో ఒక ప్రయివేట్ ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్న మహిళకు చెందిన హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న బంగారాన్ని, కత్తిపూడిలో ఒక ఇంటిలో చోరీ చేసిన ఘటనలో పట్టుకు పోయిన సుమారు.7.20 లక్షలు విలువైన 90 గ్రాముల బంగారంను గుంటూరు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన బైసాని సందీప్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై సాంకేతిక ఆధారాలను అనుసరించి నిందుతుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ సూరిఅప్పారావు, ఎస్ఐ ఎస్.హరిబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 9 మందికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 9 మందికి గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా గంగవరం మండలం సత్యవాడ గ్రామం నుంచి ఉప్పలగుప్తం గ్రామానికి ఓ శుభకార్యానికి ఆటోలో వెళుతుండగా సుంకరపాలెం వద్ద వెనక నుంచి బొలెరో వ్యాన్ ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలు ప్రయాణిస్తున్న 9 మంది గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను యానం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

భార్యను అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధిస్తున్న భర్త పై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన అంగర విజయదుర్గకు చాగల్లు మండలం చంద్రవరం గ్రామానికి చెందిన అంగర సతీష్‌తో 2024 ఆగస్టులో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.2 లక్షల కట్నం, లాంఛనాలు అందజేశారు. అయితే ఇటీవల కాలంలో సతీష్ చెడు వ్యసనాలకు బానిసై అదనపు కట్నం తీసుకురమ్మని భార్య విజయదుర్గను రోజూ వేధిస్తున్నాడు . భర్త పెట్టే బాధలు భరించలేక పుట్టింటికి వచ్చేసిన ఆమె బుధవారం స్థానిక చేసిన ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్. రాము తెలిపారు.

గోదావరిలో మునిగి యువకుని మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గౌతమి గోదావరి నదిలో సాన్నానికి తిగి ప్రమాదవశాత్తు మునిగిపోయి ఒక యువకుడు మృతి బుధవారం చెందాడు. పోలీసులు వివరాలు ప్రకారం.. రాజానగరం మండలం కొత్త తుంగపాడు గ్రామానికి చెందిన ఆలపాటి కిషోర్ (19) టెన్త్ వరకు చదువుకుని కూలి పని చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం కొత్త తుంగపాడులో బంధువుల ఇంటి వద్దకు ఫంక్షన్‌కి వెళ్లి అక్కడ నుండి తన స్నేహితులతో బొబ్బర్లంక పిచ్చుక లంక వద్ద గౌతమి గోదావరి నది ఇసుకతిన్నెల్లో ఫొటోలు తీసుకోవడానికి వచ్చాడు సాయంత్రం వరకు స్నేహితులతో ఆహ్లాదంగా గడిపిన కిషోర్ స్నేహితులతో గౌతమి గోదావరి నదిలో స్నానానికి దిగాడు. స్నానం చేస్తుండగా కిషోర్ ఊబిలో కూరుకుపోయి మునిగిపోయాడు. స్నేహితులు గాలింపు చర్యలు చేపట్టగా మునిగిపోయిన చోటే మృతి చెంది విగతజీవిగా కనిపించాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎస్.రాము సంఘటన స్థలానికి చేరుకుని కిషోర్ మృతదేహనికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

యువతి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - గోపాలపురం

ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.సతీష్ కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని రాజంపాలెం గ్రామానికి చెందిన కొండూబోయిన మమత బుధవారం ఉదయం రాజంపాలెంలో తన ఇంటి వద్ద నుండి తల్లిదండ్రులకు చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అమ్మాయి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

దుర్గారావు మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - పెరవలి

నర్సాపురం-నిడదవోలు మెయిన్ కాలువలో మంగళవారం దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఖండవల్లి గ్రామానికి చెందిన చల్లా దుర్గారావు (38) మృతదేహం బుధవారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కుటుంబ తగాదాల కారణంగా దుర్గారావు ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆయన తెలిపారు. బుధవారం రాపాక గ్రామం వద్ద కాలువలో మృతదేహాన్ని గుర్తించినట్టు తెలిపారు.

ప్రవీణ్ మృతితో క్రైస్తవుల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

క్రైస్తవ బోధకుడు ప్రవీణ్‌కుమార్ పగడాల మృతదేహం పోస్టుమార్టం నేపథ్యంలో బుధవారం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున రాజానగరం మండలం దివాన్‌చెరువు సమీపంలో ప్రవీణ్‌కుమార్ మృతి చెందిన సంఘటన విదితమే. మంగళవారం ఉదయం ఆయన మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు. దీంతో ప్రభుత్వాసుపత్రి వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రవీణ్‌కుమార్‌చ మృతిపై దళిత క్రైస్తవులు అనుమానం వ్యక్తం చేశారు. ఆయన మృతికి రోడ్డు ప్రమాదం కారణమా..? లేక ఎవరైనా ఆయనను హత్య చేశారా..? అనే ప్రశ్నలు తలెత్తాయి. హైదరబాద్ నుంచి ఆయన కుటుంబ సభ్యులు బుధవారం ఉదయానికి ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి వద్దకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున దళిత క్రైస్తవులు చేరుకున్నారు. కెఎ.పాల్, మాజీ ఎంపీ జివి.హర్షకుమార్, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ప్రతాప్‌సిన్హా, స్టీవెన్ సన్, విజయభాస్కర రెడ్డి, సంజీవరావు, ముస్లిం, మైనారిటీల అంతర్జాతీయ ప్రచారకుడు షఫీ వంటి ఎందరో క్రైస్తవ సంఘ పెద్దలు ఆసుపత్రికి చేరుకున్నారు. పోస్టుమార్టం చేయవద్దని, ప్రవీణ్ మృతదేహాన్ని తమకు అప్పగించాలని ఆయన కుటుంబికులు కోరినట్లు ప్రచారం జరిగింది. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ పోస్టుమార్టంను నిర్వహించడంతోపాటు, హోంమంత్రి సంఘటనా ప్రాంతానికి వచ్చి సంబంధిత నివేదికలో అంశాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తూ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ఆసుపత్రి ఎదురుగా ఉన్న లాలాచెరువు రోడ్డును దిగ్బందించారు. ఎస్పి డి.నరసింహకిషోర్, ఇతర పోలీసు అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ చేశారు. రాజమహేంద్రవరం నగర ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాసు ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రవీణ్ మృతికి గల కారణాలపై పోలీసులు ప్రత్యేక విచారణ చేస్తున్నారని, పోస్టుమార్టంకు అంగీకరించాలని కోరారు. వేలాది మంది దళిత క్రైస్తవులు రెండు రోజులుగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం నుంచి ఏమాత్రం స్పందన లేదంటూ ఆందోళనకారులు ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు. దీంతో ఆయన అక్కడ నుంచి వెనుతిరిగారు. ఆందోళనకారులతో పోలీసులు సంప్రదింపులు చేశారు. పోస్టుమార్టంను వీడియో రికార్డింగ్ నడుమ చేస్తామని, సంబంధిత నివేదికకు సంబంధించిన అంశాలను వెల్లడిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు పోస్టుమార్టం చేసేందుకు అంగీకరించారు. పోస్టుమార్టంను వీడియో రికార్డింగ్ మధ్య కొందరు దళిత క్రైస్తవ పెద్దల సమక్షంలో సాయంత్రం నాలుగున్నర మధ్య పూర్తిచేశారు. పోస్టుమార్టం నివేదికలోని అంశాలను వెల్లడించాలని దళిత క్రైస్తవులు పట్టుబట్టారు. పోస్టుమార్టం అనంతరం ప్రవీణ్ పార్థివదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కించిన పోలీసులు ముందుగా ఇచ్చిన హామీని పక్కన పెట్టి పోస్టుమార్టం వివరాలను వెల్లడించకుండానే భారీ బందోబస్తు మధ్య అంబులెన్స్ చుట్టూ రోప్ పార్టీని ఏర్పాటు చేసి హైదరబాద్‌కు తరలించేందుకు సిద్ధపడ్డారు. దీంతో ఆందోళనకారులు అంబులెన్స్‌ను అడ్డుకునేందుకు బైఠాయించారు. దీంతో మరోసారి ఆసుపత్రి ఆవరణలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆఖరికి పోలీసులు బలవంతంగా ఆందోళనకారులను పక్కకు నెట్టుకుంటూ ఆసుపత్రి ప్రధాన ద్వారం వరకూ ముఖ్య నేతలను ముందుకు నెట్టుకుంటూ వచ్చారు. ప్రధాన ద్వారం వద్ద నుంచి అంబులెన్స్ బయటకు వెళ్లగానే ఆందోళనకారులు బయటకు రాకుండా పోలీసు వాహనాన్ని అడ్డుపెట్టారు. దీంతో ఆందోళకారులు ఆసుపత్రి ప్రహారీ గోడను దూకి బయటకు వచి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. వుయ్ వాంట్ జస్టిస్ అంటూ పెద్దపెట్టున నినదించారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పెద్దఎత్తున నిలిచిపోయింది. దీంతో సిటిఆర్ఐ సెంటర్ నుంచి క్వారీ మార్కెట్ మీదుగా ట్రాఫిక్‌ను పోలీసులు మళ్లించారు. ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద ఆందోళన అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళనకారులు జాతీయ రహదారిని దిగ్బంధనం చేసేందుకు ర్యాలీగా బయలుదేరారు. దీంతో పోలీసులు లాలాచెరువు వద్ద గల క్వారీ మార్కెట్ రోడ్డుకు వెళ్లే రహదారిలో బారికేడ్లు ఏర్పాటు చేసి ఆందోళనకారులను అడ్డుకున్నారు.

లాలాచెరువు జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారులు

ప్రవీణ్ మరణంలో కుట్ర..?

క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ మృతి వెనుక కుట్ర దాగివుందనే అభిప్రాయాలను పలువురు క్రైస్తవ పెద్దలు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రముఖ క్రైస్తవ బోధకుడు కెఎ.పాల్, విజయభాస్కర్ రెడ్డి, ముస్లిం, మైనారిటీ అంతర్జాతీయ ప్రచారకుడు షఫీ వంటి వారు మీడియాతో మాట్లాడారు. సంఘటనా ప్రాంతంలో ప్రవీణ్ మృతదేహం ఉన్న తీరుపై వారు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కుట్ర అని, ఆయనను హత్య చేశారని వారు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

బిసి కాలనీని పరిశీలించిన జ్యోతుల

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని గెద్దనాపల్లిలోని బిసి కాలనీని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హైస్కూల్ రోడ్డు నుంచి బిసి కాలనీలో మురికి నీరు పారేలా డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనను సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్ శాఖ డిఇ ఉమా శంకర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ పర్యటనలో ఎంపిపి తోట రవి, తోట గాంధీ, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, టిడిపి మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకటశివ, తూము కుమార్, కాళ్ళ వెంకటేష్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 74/2024
Between:
1. Allu Ramalakshmi
2. Poluparti Venkata Lakshmi ...Plaintiffs
AND
Anivireddy Venkata RAmana & 6 Others ...Defendants
D-4: Boddu Devi, W/o. (late) Boddu Govindhu, Hindu, aged 36 years, resident of Pithapuram, Kakinada District, A.P. ...4th Defendant
పై నెంబరు దావాలో 4వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్సు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 01-4-2025 సంగరం తేదీ ఉదయం 10.30 నిగలకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి పి.నందకిషోర్
15-3-2025 అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు : కాకినాడ
I.A.No.115/2024 in O.S.No.432/2021
Between:
కొండెపూడి రమాదేవి...పిటీషనర్ / ప్లెయింటిఫ్
మరియు
శ్రీమతి గోగినేని స్వరూపరాణి, వగైరాలు ...రెస్పాండెంట్లు / డిఫెండెంట్లు
R1 : శ్రీమతి గోగినేని స్వరూపరాణి, W/o. రాజబాబు, గృహిణి, డోర్.నెం. 2-17E-2, వెంకటనగర్, కాకినాడ.
పై నెంబరు I.A.No. 115/2024 సవరణ పిటిషన్ లో శ్రీ కోర్టు వారి నుండి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పై నెంబర్ పిటీషన్ ది. 16-04-2025 సంగ తేదీన వాయిదా అయ్యివున్నది. కావున పైన తెలిపిన కోర్టులో మీరు హాజరు అయ్యి ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేని యెడల పై పిటీషన్ తమ పరోక్షమున తీర్మానము వెలువడెననియు ఇందుమూలముగా తెలియపరచడమైనది.
|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A.No.511/2024, I.A.No.174/2021, O.S.No. 554/2021
Between :
మడికి రాజేశ్వర దయాళ్ ...పిటిషనరు
మరియు
1) మాచార శ్రీవల్లి
2) మాచార నాగమణి ..రెస్పాండెంట్స్
To రెస్పాండెంట్స్:-
R1 : వర్ధిపర్తి(మాచార) వల్లి నర్స లక్ష్మి, W/o.శివరామ కృష్ణ, డో.నెం. 65-3-1/2, GPT రోడ్డు,మెహర్ నగర్, కాకినాడ-4.
R2 : భీమరాజు(మాచార) నాగమణి, C/o. వర్ధిపర్తి మాచార వల్లి నర్సలక్ష్మి, డో.నెం. 65-3-1/2, GPT రోడ్డు, మెహర్ నగర్, కాకినాడ-4.
పై నెంబరు దావాలో మరియు పిటిషను లో 1వ మరియు 2వ రెస్పాండెంట్స్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్సు/నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు కావున ది. 9-04-2025 తేదీ వాయిదా వేసియున్నారు. ఆ రోజు ఉదయం 10-30 నిగలకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
అద్దేపల్లి మురళీధర్, పిటిషనర్ తరపు అడ్వకేట్
కాకినాడ. ప్రతాప్ నగర్, కాకినాడ
ది.25-03-2025 సెల్: 98491 70270

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A.No.497/2024, O.S.No. 554/2021
Between :
మడికి రాజేశ్వర దయాళ్ ...పిటీషనరు
మరియు
1) మాచార శ్రీవల్లి
2) మాచార నాగమణి ..రెస్పాండెంట్స్
To రెస్పాండెంట్స్:-
R1 : వర్ధిపర్తి(మాచార) వల్లి నర్సలక్ష్మి, W/o.వర్ధిపర్తి శివరామ కృష్ణ, డో.నెం.65-3-1/2, GPT రోడ్డు, మెహర్ నగర్, కాకినాడ-4.
R2 : భీమరాజు మాచార నాగమణి, C/o. వర్ధిపర్తి మాచార వల్లి నర్సలక్ష్మి, డో.నెం. 65-3-1/2, GPT రోడ్డు, మెహర్ నగర్, కాకినాడ-4.
పై నెంబరు దావాలో మరియు పిటిషన్ లో 1st మరియు 2వ రెస్పాండెంట్స్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్సు/నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు కావున ది. 9-04-2025 తేదీ ఉదయం 10-30 నిగలకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
అద్దేపల్లి మురళీధర్,
పిటీషనర్ తరపు అడ్వకేట్
కాకినాడ. ప్రతాప్ నగర్, కాకినాడ
ది.25-03-2025 సెల్: 98491 70270

భోజనాల షెడ్డును ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గర్భిణుల అన్నదానం కోసం నిర్మించిన షెడ్డును బుధవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ దేవి సీఫుడ్స్ సంస్థ రూ.1.5 లక్షల వ్యయంతో ఈ షెడ్డును నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, డాక్టర్ శ్రీనివాస్, హెడ్ నర్స్ రమాదేవి, జనసేన నాయకులు పొలమరశెట్టి సత్తిబాబు, ఒబిలిశెట్టి గున్ని, వంగలపూడి సతీష్, ఫేస్బుక్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రగతిలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆద్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసిందని కళాశాల ఛైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో బ్రెయినోవిజన్ ప్రతినిధి వి.సాయిపవన్ వివిధ అంశాలపై మాట్లాడారు. ఫాకల్టీలుగా కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, ఉప-కోఆర్డినేటర్ పి రవిశంకర్, విద్యార్థి కోఆర్డినేటర్ పి.సురేష్ వ్యవహరించారు. ఇసిఇ విభాగాధిపతి వి.ప్రశాంత్, మేనేజ్మెంట్ డైరెక్టర్ ఎంవి.హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ అకడెమిక్స్ డాక్టర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నరేష్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి - కాజులూరు

మందుల షాపుల యజమానులు నిబంధనలు పాటించక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళీకృష్ణ హెచ్చరించారు. బుధవారం మండలంలోని గొల్లపాలెంలో పలు మందుల షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులు షాపులు యజమానులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని, రికార్డులు మెయింటైన్ చేయాలని పరిశుభ్రతతో పాటు ఫార్మసిస్ట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. నిబంధనలు పాటించని షాపులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పిఠాపురంకు చెందిన కార్తికేయ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు రామ్ చరణ్ ఫౌండేషన్ సభ్యులు బలిరెడ్డి గంగబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కీళ్ల, ఎముకలు, మోకాళ్ల, బిపి, షుగర్, థైరాయిడ్, గజ్జి, తామర, సోరియాసిస్ వంటి రోగాలతోపాటు, వినికిడి సమస్యలకు సంబంధించిన వైద్యులు రానున్నారని, కావున ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎట్టకేలకు ఏటిగట్టుకు మోక్షం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఏటిగట్టుకు గండిపడి దశాబ్దాలుగా ప్రజలు, రైతులు, మత్స్యకారులు పడుతున్న ఇబ్బందులకు నేటితో తెరపడింది. మండలంలోని పోలేకుర్రు పంచాయతీ తూర్పు పేట వద్ద కటింగ్ కాలువ ఏటిగట్టుకు దశాబ్దాల క్రితం గండి పడింది. దీంతో ఆ రహదారిపై ప్రయాణించే రైతులు, స్థానిక ప్రజలు, మత్స్యకారులు పదేళ్లుగా నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు,కలెక్టర్ చొరవతో గండి పూడ్చడానికి, శాశ్వత నిర్మాణం చేపట్టడానికి నిధులు కేటాయించారు. ఉపాధి హామీ పథకంలో రూ.25 లక్షల నిధులతో పనులు పూర్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి అవసరం

ప్రజాశక్తి - కోటనందూరు

మెట్ట ప్రాంత రైతాంగం ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల మహిళా సమైక్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ కన్వెన్షన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని అన్నారు. గతంలో అల్లిపూడి, కె.గొట్టం గ్రామాల్లో మొదటి విడతగా ప్రకృతి వ్యవసాయం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే పి.కొట్టం, కెఎ.మల్లవరం, జగన్నాధపురం, ఇందుకపల్లి, బొద్దవరం గ్రామాలను ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం సూరికుమారి, ఎంపిడిఒ పి.వెంకటనారాయణ, డిటి, సిబ్బంది పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ భీమవరం 2వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 87/2024
కనపాల కర్నేలు ...వాది
మామిడిపల్లి రాజశేఖర్ ...ప్రతివాది
ప్రతివాది:- మామిడిపల్లి రాజశేఖర్, S/o. వీరాస్వామి, డోర్ నెం. 5-156, హరిజన కాలనీ, రామాలయం వద్ద, యర్నగూడెం విలేజ్, దేవరపల్లి మండలం, తూగగోగజిల్లా.
వాది తరపున దాఖలు చేసిన పత్రికా ప్రకటన
(U/o 5 రూల్ 20 CPC ప్రకారం)
పై నంబరు దావాలో రెస్పాండెంటు/ప్రతివాదికి శ్రీ కోర్టువారి ద్వారా పలుమార్లు నోటీసులు పంపినా తీసుకోనందున పత్రికా ప్రకటన ద్వారా సబ్‌స్టిట్యూట్ సర్వీసు నిమిత్తం కోర్టు వారు ఉత్తర్వులు జారీచేసినారు. కావున మీరు ది. 30-06-2025వ తేది ఉదయం 10-30 నిగలకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై దావా నందు సమాధానం తెలుపవలెను. లేని యడల మీ పరోక్షమున తీర్మానము చేయుదురని యిందుమూలముగా తెలియజేయడమైనది.
అడబాల శ్రీనివాసరావు
భీమవరం అడ్వకేట్
తేది:26-03-2025 భీమవరం
సెల్: 94411 69939

నీటి తొట్ల నిర్మాణం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పశువుల నీటి తొట్లు నిర్మించనున్నారని ఎపిఒ సుధీర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని 23 గ్రామాల్లో నీటి తొట్లు నిర్మాణానికి ప్రతిపాదన లు సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే 101 ఉపాధి పనుల్లో 2,157 మంది ఉపాధి కూలీలు బుధవారం పనులు చేశారని తెలిపారు.

MUNICIPAL CORPORATION, RAJAMAHENDRAVARAM
Engineering Section : e-Procurement Short Tender Notice
NIT No. 289 and 291/MCR/General/2024-25 Dt: 24-03-2025
Online tenders are invited from the eligible contractors on e-procurement for 02 works for with an Estimated Contract Value of Rs. 18,38,181/-
1. Tenders can be down loaded. The tender schedules for the above works will be available from 24-03-2025 at 9.00 P.M on wards. 2. Last date of time of receipt of tenders on or before dt. 01-04-2025 upto 2.00 PM.
3. Further details can be seen at 'e'-procurement website www.apeprocurement.gov.in & https://tender.apeprocurement.gov.in
Sd/- KETAN GARG, I.A.S.,
COMMISSIONER
Municipal Corporation, Rajamahendravaram

ఆశీల వేలంలో రూ.17 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆశీల వేలంపాట ద్వారా రూ.17 లక్షలు ఆదాయం సమకూరిందని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి తెలిపారు. బుధవారం ఆశీల వేలం పాటను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది రూ.16.60 లక్షలు రాగా ఈ ఏడాది అదనంగా రూ.40 వేలు అదనంగా ఆదాయం సమకూరిందన్నారు. ఈ వేలం పాటలో మేనేజర్ జ్యోతి రాణి, మున్సిపల్ రెవిన్యూ ఆఫీసర్ చంద్రశేఖరం, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు గిరిబాబు పరామర్శ

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని పలు కుటుంబాలను నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. ముక్కోళ్ల గ్రామంలో పాము కాటుకు గురయిన కౌలు రైతు అనపర్తి కృష్ణ, కిర్లంపూడి గ్రామానికి చెందిన కుర్ల బుల్లిరాజు భార్య పద్మావతి, గంప నూకరాజు భార్య రాజమ్మల కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెండి కోట నాగబాబు, నాయకులు కరణం అప్పలరాజు, కుర్ల చిన్నబాబు, శరకణం సంతోష్ పాల్గొన్నారు.

జిప్‌మెర్ ఆసుపత్రిని సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - యానాం

సైన్స్ స్టడీ టూర్‌లో భాగంగా కాకినాడ జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు స్థానిక జిప్‌మెర్ మల్టీ స్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్‌ను బుధవారం సందర్శించారు.

పోక్సో చట్టంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కోటనందూరు

మండలం మహిళా సమైక్య కార్యాలయంలో బుధవారం పోక్సో చట్టంపై పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం సూర్యకుమారి మాట్లాడుతూ మారిన ఆధునిక యుగంలో యువతీ, యువకులు చిన్న వయసులోనే చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని అన్నారు. వాటికి దూరంగా ఉండడానికి ప్రయత్నించాలని అన్నారు. ఎవరైనా వేధింపులకు గురవుతున్నప్పుడు చట్టప్రకారం దానిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై ఆమె అవగాహన కల్పించారు.

బహిరంగ ప్రకటన
కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలం, ఇంజరం గ్రామ కాపురస్తులు డోర్ నెం.6-69 కలిగిన అడ్రస్ నాగేడి రాజు, S/o.పెద్ద ఆంజనేయులు గారు యావన్మందికి తెలియజేయునది ఏమనగా...
నా యొక్క ఆస్థికి సంబంధించిన ది.17-03-2025 తారీఖున నాగేడి ధనరాజు కుమారుడు నాగేడి పెద్ద ఆంజనేయులు వారి వద్ద నుండి వ్రాయించి ఇచ్చిన సెటిల్‌మెంట్ దస్తావేజు నంబరుగా 1828/2025గా తాళ్ళరేవు సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో నా పేరున అనగా నాగేడి ఇరుమల్లు, నాగేడి రాజు, S/o.పెద్ద ఆంజనేయులు పేరు మీదుగా రిజిష్టర్ కాబడింది.
ఈ సెటిల్‌మెంట్ దస్తావేజుకు లింక్ డాక్యుమెంట్ అయిన డాక్యుమెంట్ నెం.4507/2009గా సెటిల్‌మెంట్ దస్తావేజుకు 03-06-2009 నాగేడి ధనరాజు పేరు మీదుగా రిజిష్టర్ కాబడింది. ఈ సదరు డాక్యుమెంట్ అనగా డాక్యుమెంట్ నెం.4507/2009 డాక్యుమెంట్‌ను ఆస్థికి అనగా డాక్యుమెంట్ నెంబరు 1828/2025 లింకు డాక్యుమెంట్ అయి ఉన్నది.
విషయం ఏమనగా కోరంగి యస్.ఐ. గారికి రిపోర్టు ఇవ్వడం జరిగింది. నా క్లయింట్ డాక్యుమెంట్స్ VERITAS FINANCE LIMITED, సుంగరపాలెం బ్రాంచ్ వారికి తాకట్టు పెట్టి డబ్బు అప్పు తీసుకొనుచున్నారు. డాక్యుమెంట్ నెంబరు 4507/2009 దస్తావేజుకి ప్రత్యామ్నాయంగా సర్టిఫైడ్ కాపీని ఆ బ్రాంచ్‌కి హామీగా అందజేయుచున్నారు.
కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికిన యడల నా క్లయింట్‌కి తెచ్చి ఇవ్వగలరని కోరుచున్నాము.
ఆ దస్తావేజు ఎవరికైనా దొరికిన యడల దానిని ఎవరైనా వినియోగించిన యడల చట్ట విరుద్ధం అగును. అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడును. కావున ఈ ప్రకటన జారీచేయడమైనది.
సిద్ధాంతపు తిరుపతి రావు, అడ్వకేట్-నోటరీ
డోర్ నెం.5-81, వల్లూరు/ఉండూరు, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా.

బహిరంగ ప్రకటన
కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలం, తాళ్ళరేవు గ్రామ కాపురస్తులు డోర్ నెం.3-110 కలిగిన అడ్రస్ కొప్పాడి రవితేజ, S/o.నాగేశ్వరరావు గారు యావన్మందికి తెలియజేయునది ఏమనగా...
నా యొక్క ఆస్థికి సంబంధించిన ది.29-05-2023 తారీఖున కొప్పాడి నాగేశ్వరరావు గారి భార్య అయిన కొప్పాడి వీరవేణి వారి వద్ద నుండి వ్రాయించి ఇచ్చిన సెటిల్‌మెంట్ దస్తావేజు నంబరుగా 3440/2023గా తాళ్ళరేవు సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో నా పేరున అనగా కొప్పాడి నాగేశ్వరరావు గారి భార్య కొప్పాడి వీరవేణి పేరు మీదుగా రిజిష్టర్ కాబడింది.
ఈ సెటిల్‌మెంట్ దస్తావేజుకు లింక్ డాక్యుమెంట్ అయిన డాక్యుమెంట్ నెం.138/1984గా సెటిల్‌మెంట్ దస్తావేజుకు 30-01-1984 డాక్యుమెంట్ ఆస్థికి అనగా డాక్యుమెంట్ నెం.3440 లింక్ డాక్యుమెంట్ అయి ఉన్నది.
విషయం ఏమనగా కోరంగి యస్.ఐ. గారికి రిపోర్టు ఇవ్వడం జరిగింది. నా క్లయింట్ డాక్యుమెంట్స్ VERITAS FINANCE PRIVATE LIMITED, KAKINADA బ్రాంచ్ వారికి తాకట్టు పెట్టి డబ్బు అప్పు తీసుకొనుచున్నారు. డాక్యుమెంట్ నెంబరు 138/1984 దస్తావేజుకి ప్రత్యామ్నాయంగా సర్టిఫైడ్ కాపీని ఆ బ్రాంచ్‌కి హామీగా అందజేయుచున్నారు.
కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికిన యడల నా క్లయింట్‌కి తెచ్చి ఇవ్వగలరని కోరుచున్నాము.
ఆ దస్తావేజు ఎవరికైనా దొరికిన యడల దానిని ఎవరైనా వినియోగించిన యడల చట్ట విరుద్ధం అగును. అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడును. కావున ఈ ప్రకటన జారీచేయడమైనది.
సిద్ధాంతపు తిరుపతి రావు, అడ్వకేట్-నోటరీ
డోర్ నెం.5-81, వల్లూరు/ఉండూరు, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా.

గ్రామపంచాయతీ కార్యాలయం, చిట్యాల
గోపాలపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా
టెండరు ప్రకటన
రి.క. నెం. /2025 తేది.26-03-2025
తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం మండలం, చిట్యాల గ్రామపంచాయతీ నందు 2025-2026 సంవత్సరమునకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు ఈ దిగువ ఉదహరించిన పనులు చేయుటకు టెండర్లు పిలుచుటకు ది. 29-03-2025 వరకు టెండర్లు స్వీకరించబడి, అదేరోజు ఉదయం 10.30 నిగలకు టెండర్లు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని, లేక అధికారం ఇవ్వబడిన వారిచే గాని టెండర్లు తెరవబడును. టెండర్లు దాఖలు చేయువారు షెడ్యూల్ నందు చూపబడిన టెండర్లు డిపాజిట్లు చెల్లించి రశీదు జతపరచవలెను. ఇతర వివరములు కార్యాలయం పని వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.
షెడ్యూలు

వ.నెం.	వివరములు	చెల్లించవలసిన ధరావత్తు
1	ప్రజారోగ్య పారిశుద్ధ్య నిర్వహణ - 3	రూ. 100/- (1కి)
2	రక్షిత మంచినీటి పథకములు నిర్వహణ - 1	రూ. 100/- (1కి)
3	వీధి దీపములు రిపేరు చేయుటకు - 1	రూ. 100/- (1కి)
4	బుక్స్ & స్టేషనరీ సామానులు సరఫరా - 1	రూ. 200/-
5	విద్యుత్ విడి పరికరములు కలెక్టర్ అప్రూవల్ ఆథరైజ్డ్ డీలర్లు మాత్రమే - 1	రూ. 200/-
6	పి.హెచ్. సామానులు సప్లయి - 1	రూ. 200/-

పై అయిటములు కాలపరిమితి 2025-2026 అనగా 01-04-2025 నుండి 31-03-2026 వరకు
సం/- నూతంగి సరోజిని, సర్పంచ్ సం/- అత్తిలి వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, చిట్యాల గ్రామపంచాయతీ, చిట్యాల
గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయం, చెరుకుమిల్లి
గోపాలపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా
టెండరు ప్రకటన
రి.క. నెం. /2025 తేది.26-03-2025
తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం మండలం, చెరుకుమిల్లి గ్రామపంచాయతీ నందు 2025-2026 సంవత్సరమునకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు ఈ దిగువ ఉదహరించిన పనులు చేయుటకు టెండర్లు పిలుచుటకు ది. 29-03-2025 వరకు టెండర్లు స్వీకరించబడి, అదేరోజు ఉదయం 10.30 నిగలకు టెండర్లు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని, లేక అధికారం ఇవ్వబడిన వారిచే గాని టెండర్లు తెరవబడును. టెండర్లు దాఖలు చేయువారు షెడ్యూల్ నందు చూపబడిన టెండర్లు డిపాజిట్లు చెల్లించి రశీదు జతపరచవలెను. ఇతర వివరములు కార్యాలయం పని వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.
షెడ్యూలు

వ.నెం.	వివరములు	చెల్లించవలసిన ధరావత్తు
1	ప్రజారోగ్య పారిశుద్ధ్య నిర్వహణ - 1	రూ. 100/- (1కి)
2	రక్షిత మంచినీటి పథకములు నిర్వహణ - 1	రూ. 100/- (1కి)
3	వీధి దీపములు రిపేరు / ప్లంబింగ్ నిర్వహణ - 1	రూ. 100/- (1కి)
4	బుక్స్ & స్టేషనరీ సామానులు సరఫరా - 1	రూ. 200/-
5	విద్యుత్ విడి పరికరములు కలెక్టర్ అప్రూవల్ ఆథరైజ్డ్ డీలర్లు మాత్రమే - 1	రూ. 200/-
6	పి.హెచ్. సామానులు సప్లయి - 1	రూ. 200/-

పై అయిటములు కాలపరిమితి 2025-2026 అనగా 01-04-2025 నుండి 31-03-2026 వరకు
సం/- ముళ్ళపూడి వరలక్ష్మి, సర్పంచ్ సం/- మొయ్యేటి రాజేష్, పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, చెరుకుమిల్లి గ్రామపంచాయతీ, చెరుకుమిల్లి
గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా